# సర్జన్

డాక్టర్ దయానందాన్ని చూస్తే జాలీ, కోపం కూడా కలుగుతుంటాయి కరుణాకరానికి.

ఇద్దరూ కొలిగ్స్. ఒకే ఆసుపత్రిలో తలో విభాగంలోనూ సర్జెన్లు.

కరుణాకరం న్యూరోసర్జన్– దయానందం ఆర్థోపెడిక్ సర్జన్.

దయానందం పేషెంట్స్ మీద చూపించే శ్రద్ధకన్నా పైరవీలు.. చేయించుకుని ప్రమోషన్ పొందటానికి ఎక్కువ సమయాన్ని వినియోగిస్తుండటం ఎంతమాత్రం నచ్చదు కరుణాకరానికి.

"కొంత హృదయం కూడా ఉండాలి డాక్టర్‌కి" అన్నాడు ఓ రోజు తెగించి.

"నాకు నువ్వు నీతులు చెప్పక్కర్లేదనుకుంటాను"

"నీతులు కాదు- ఎముకలు విరిగి- ఓర్చుకోలేని స్థితిలోనే ఆపరేషన్ చేయించుకోవటానికి వస్తారు. అంతగా తొందర్లేని వాళ్లు, బాధని ఓర్చుకునే ఓపికున్నవాళ్లూ, ఇక్కడ డబ్బుకి తట్టుకోలేనివాళ్లూ కట్లతోనో, పట్లతోనో గడిపేస్తారు. వాళ్లని మన సొంతపనుల ధ్యాసలో పడి..."

"చూడు మిస్టర్ కరుణాకర్... నా ప్లాన్‌లు నాకుంటాయ్! నేను చేయాల్సిన పనులు నేను చేస్తాను"

✦ ✦ ✦

నిజంగానే దయానందం అనుకున్న దాన్ని సాధించాడు.

తను పనిచేస్తున్న కార్పోరేట్ హాస్పటల్‌కి సూపరింటెండెంట్ అయిపోయాడు.

కత్తులూ కటార్లు... పట్టుకోనని నిర్ణయం తీసేసుకున్నాడు.

సంతకాలెట్టడం... సతాయించడం- రాజీనామాలు చేయించడం- రాజ్యం ఏలడం, అన్ని అధికారాల్నీ- పై అధికారుల చేతుల్నించి 'హస్త'గతం చేసుకున్నాడు.

హృదయం చిన్నదైపోయింది. మెదడు శృతి మించింది.

కరుణాకర్ దయానందం తాలూకు ప్రతీ అరాచకాన్నీ గమనిస్తూనే ఉన్నాడు.

ఇప్పుడు అతని హోదా పెరిగిపోయింది. ఏమనగలడు.

మరో ఆర్థోపెడిక్ సర్జన్‌నీ- ఇంకో న్యూరోసర్జన్‌నీ ఎపాయింట్ చేయడానికి ప్రకటన ఇచ్చాడు.

కరుణాకర్‌కి ఖచ్చితంగా.. తను ఇంక అక్కడ ఇమడలేనని నిర్ధారణ

అయిపోయింది. అర్థమైపోయింది.

"నేను రిజైన్ చేస్తున్నాను దయానందం... అహో దయానందంగారూ.."

దయానందం దొంగప్రేమ కూడా నటించలేదు.

"ఇట్సోకే" అన్నాడు సింపుల్‌గా-

చేతికొచ్చిన వృత్తిని ఎక్కడైనా వినియోగించుకోగల సర్జన్ గొప్ప కళాకారుడు అని కరుణాకర్ నమ్మకం.

'మెదడుని నిత్య వసంతంగా ఉంచే తోటమాలిని నేను. అక్కర్లేని కొమ్మల్ని కత్తిరించి కావల్సిన దానితో అంటుగడతాను' అని కవిత రాసుకున్న స్వస్వరూపజ్ఞాని డా. కరుణాకర్... గేటు దాటగానే కరుణాకర్‌కి బోల్డు హాస్పటల్స్‌లో ఆఫరొచ్చింది పార్టైమైనా చేయమని.. అడిగారు.

కొంతసేపు బుర్ర బ్లాంకైంది.... అంతటి న్యూరోసర్జన్‌కి కూడా- నిలదొక్కుకుంటూ.. 'అలాగే ఆలోచిస్తాన'ని తప్పించుకున్నాడు. ఇప్పుడైనా తనే- ఇంటర్వ్యూలు చేసి మంచి ఆసుపత్రిని ఎంచుకోవాలని అతని మెదడు హెచ్చరించింది.

తనకు నచ్చిన హాస్పటల్‌లో- పేషెంట్స్‌ని ప్రేమించే ప్రదేశంలో జాయినయ్యాడు- గౌరవమూ, దాంతోపాటు జీతమూ పెరిగింది!

ఒకట్రెండుసార్లు దయానంద్‌కి ఫోన్‌చేసి... స్నేహపూర్వకంగా తన మూవ్‌మెంట్స్, డెసిషన్స్ చెప్పాడు కరుణాకర్.

"సరే అది నీకు తగిన హాస్పిటలేలే" వెక్కిరింతగా అంటూనే....

"నాకు మా హాస్పిటల్ కారు ఇచ్చింది- నా కారు అమ్మేశాను. డ్రైవర్ జీతం కూడా లేదు. హాస్పిటలే భరిస్తోంది" అన్నాడు రెచ్చగొడుతూ దయానంద్.

"ఓ.. కంగ్రాట్స్"

"మనస్ఫూర్తిగా అనట్లేదు నువ్... అనలేవులే నాకు తెల్సు"

"అదేం లేదు గురూ... నీ అభివృద్ధికి నేను ఆనందిస్తున్నాను"

"రైట్.. రేపు సాయంత్రం కొత్తకారు పార్టీ ఇస్తున్నాను... కంట్రీ క్లబ్‌కి రా!"

"లేదు భయ్యా! ఒక ఆపరేషన్ హడావుడి వుంది. నేను మళ్లీ ఈ ఆఫర్‌ని వినియోగించుకుంటా! రేపటికి క్షమించెయ్"

"నువ్ రావని నాకు తెల్సులే- ఇట్సోకే- ఉంటా బై"

సడన్‌గా ఫోను పెట్టేశాడు దయానందం-

'వీడి మెదడుకెప్పుడన్నా చికిత్స చెయ్యాల్సిందే' కరుణాకర్ మనస్సు చివుక్కుమని అనుకున్నాడు.

✦ ✦ ✦

కన్సల్టింగ్ రూమ్‌లో తలనొప్పివాళ్లనీ-

మతి మరుపువాళ్లనీ, పక్షవాతం వచ్చినవాళ్లనీ వగైరా వగైరా పేషంట్స్‌ని చూస్తున్నాడు కరుణాకరం.

ఇంటర్‌కమ్ మోగింది-

"సీరియస్ కేస్ హెడ్ ఇంజ్యూరీ- వెంటనే అటెండవ్వాలి మీరు"

"ఆపరేషన్ థియెటర్‌కి షిఫ్ట్ చేయండి"

కరుణాకర్ అవుట్ పేషెంట్స్‌ని మర్నాడు రమ్మనమని చెప్పి పరుగెట్టాడు.

ప్రాణం వుంది... గుఫ్‌మని మందు వాసన కొట్టింది! మొహం కూడా పోల్చుకోడానికి వీలుగా లేదు- కానీ దయానందం అని అతను గుర్తించాడు.

ఐదారు గంటలు ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసాడు కరుణాకరం-

✦ ✦ ✦

స్పృహలోకి రాగానే అయోమయంగా చూశాడు దయానందం.

"మీరెవరు? నేనెక్కడున్నాను" మాటలు అప్రయత్నంగా వచ్చాయి- కాదు ప్రయత్నపూర్వకంగా అన్నాడు.

"నేను నీ ఫ్రెండుని- దయానందం" అన్నాడు కరుణాకర్.

మళ్లీ మగతలోకి వెళ్లిపోయాడు.

కరుణాకరం రెండ్రోజులుగా తనని కనిపెట్టుకుని చూస్తున్నాడని దయానందానికి తెలిసేటప్పటికి మరి రెండు రోజులు గడిచాయ్.

✦ ✦ ✦

"నేన్నీకు చాలా అన్యాయం చేసినా- నువ్వు నన్ను... నన్ను బ్రతికించావ్" కళ్లనీళ్లు- గొంతుదీనంగా గద్గదంగా వినిపిస్తోంది!

"దయానందం! ప్రస్తుతం ఏమీ ఆలోచించకు. మా హాస్పిటల్ ముందే యాక్సిడెంట్ అవటం మూలాన్న నిన్ను లక్కీగా ఇక్కడికి తీసుకొచ్చారు. నువ్ కోలుకుంటున్నావ్. నువ్ మృత్యుంజయుడవే!"

దయానందం చేతులు జోడిస్తూ.. "నువ్వే మృత్యుదేవతని ఎదిరించినవాడివి. యూ ఆర్ గ్రేట్!" అన్నాడు దయానందం.

కరుణాకర్ తనలో తను నవ్వుకున్నాడు. 'ఎలాగైనా ఇతనికి మెదడు మార్చి మనిషిని చెయాలని- ఇకనైనా మనసు మారితే బాగుణ్ను' అనుకున్నాడు కరుణాకరం.

ఇతనికి నేను చేసిన అన్యాయం ఎలాంటిది- ఇతనెంత 'సజ్జనుడు' అనుకున్నాడు దయానందం- కరుణాకరానికి కన్నీటితో అభిషేకం చేస్తూ.

